క్లుప్తంగా

బాణాసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి



పెనుగంచిప్రోలు: అనుమతులు లేకుండా బాణాసంచా విక్రయాలు జరిపితే పేలుడు పదార్థాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎంఎస్‌కె అర్జున్ గురువారం హెచ్చరించారు. గ్రామాల్లో బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసినా, సరైన భద్రతా ప్రమాణాలు పాటించకుండా విక్రయాలు సాగించినా చర్యలు తప్పవవన్నారు. దీపావళిని పురస్కరించుకుని బాణాసంచా తయారీ, విక్రయదారులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాణసంచా విక్రేతలు తగిన అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ సూచించారు.

డాక్టర్ రత్నప్రియదర్శినికి సత్కారం



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): గ్రామంలోని ఆయుర్వేద వైద్యశాల రాష్ట్రస్థాయిలో ఉత్తమ స్వచ్ఛ ఆయుష్ కేంద్రంగా ఎంపికైన నేపథ్యంలో వైద్యాధికారి డాక్టర్ వై.రత్నప్రియదర్శినిని గురువారం ఘనంగా సత్కరించారు. వైద్యాధికారిని సత్కరించి అభినందనలు తెలియజేసినవారిలో వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కనకపూడి భాస్కరరావు, ఆర్ఎంపీ కీతం నాగేశ్వరరావు, కాంపౌండర్ ఎస్.శైలజ, యోగా శిక్షకులు కె.కృష్ణవేణి, పంచకర్మ థెరపిస్ట్ కె.శ్రీజ, డి.రాజారావు, ఏఎన్ఎం కె.జ్ఞానమ్మ, మహిళా సంరక్షణ కార్యదర్శి కె.రాజేశ్వరి ఉన్నారు.

బాధితుడికి చేయూత



గొట్టుముక్కల(కంచికచర్ల): పేదలను గుర్తించి మహిమ ఫౌండేషన్ తరఫున తమవంతుగా ఆర్థిక సహాయసహకారాలు అందిస్తున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకులు సురేష్ తెలిపారు. మండలంలోని గొట్టుముక్కలలో పక్షవాతంతో బాధపడుతున్న జాల శ్రీను కుటుంబానికి ఫౌండేషన్ ద్వారా రూ.3,500 విలువగల నిత్యావసర సరుకులు, రూ.4600 నగదును గురువారం అందజేశారు. ఈసందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా పేదలకు చేయూతనిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మోదుగు ఆనంద్, క్రీస్తు సంఘ సువార్తికులు మందా శివాజీ, మందా వసంత తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలి



వీరులపాడు: విద్యార్థి దశ నుంచే బాలబాలికలు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని అందుకనుగుణంగా ముందుకు సాగాలని ఎంఈవోలు వెంకయ్య, పాల్ కెనడీ సూచించారు. మండలంలోని జమ్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోను రాణించాలన్నారు. గెలుపు ఓటములను సమానంగా తీసుకుని క్రీడా స్ఫూర్తితో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సూరిబాబు, ఉపాధ్యాయులు పాల్, రాజు, సాంబశివరావు, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పేట 5,6వ వార్డుల్లో మంచినీటికి కటకట



జగ్గయ్యపేటఅర్బన్: స్థానిక ఈశ్వరరావు హోటల్ ఎదురుగా మంచినీటి పైపులైన్ పగిలిపోయి నీరంతా వృధాగా పోతుండటంతో పట్టణంలోని 5 ,6 వార్డుల ప్రజలకు సజావుగా నీరు అందడం లేదు. దీంతో ఆయా వార్డుల ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందిపడుతున్నారు. పైపులైన్ పగిలిపోవడంపై స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో మున్సిపల్‌వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ గురువారం మున్సిపల్ నీటిసరఫరా విభాగం సిబ్బందితో కలిసి పగిలిపోయిన పైపులైన్‌ను పరిశీలించి సమస్యను మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర దృష్టికి తీసుకువెళ్లారు. చైర్మన్ స్పందిస్తూ పైపులైన్ లీకేజీ మరమ్మతు పనులు శుక్రవారం చేపడతామని హామీ ఇచ్చారు.

బెల్టుషాపులే అడ్డాగా నకిలీ మద్యం!

- అధికార పార్టీ నాయకుడే సూత్రధారి
- జోరుగా నకిలీ మద్యం విక్రయాలు...
- ఇబ్రహీంపట్నం ఘటనతో ఆందోళనలో మందుబాబులు

కంచికచర్ల: రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన నకిలీ మద్యం అంశం నందిగామ నియోజకవర్గంలోనూ ప్రకంపనాలు సృష్టిస్తోంది. నందిగామ, కంచికచర్ల ఎక్సైజ్‌శాఖల పరిధిలోని ఆయా దుకాణాల్లోనూ నకిలీ మద్యం విక్రయాలు సాగాయనే ప్రచారం మందుబాబులకు కలవరపెడుతోంది. ఎక్సైజ్ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా కంచికచర్ల, వీరులపాడు మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఉన్న సుమారు 154 బెల్టుషాపుల ద్వారా ఈ నకిలీ మద్యం విక్రయాలు జోరుగా సాగినట్లు సమాచారం. నకిలీ మద్యాన్ని మందుబాబులు గుర్తించకుండా ఉండేలా ముఖ్యంగా రద్దీ సమయాలు, రాత్రి వేళల్లో ఈ బాటిళ్లను విక్రయించారనే ప్రచారం సాగుతోంది.

కలవరపడుతున్న మందుబాబులు..

కంచికచర్ల మండలంలో సిండికేట్‌గా ఏర్పడిన వ్యాపారులు స్టిక్కర్లు వేసి మరీ అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్నారు. ముఖ్యంగా బెల్టుషాపులను భారీగా ఏర్పాటు చేసుకుని మద్యాన్ని గ్రామాల్లో ఏరులై పారిస్తున్నారు. ఒక్కో గ్రామంలో రెండుమూడు బెల్టుషాపులకు మద్యాన్ని సరఫరా చేస్తూ ఒక్కో బాటిల్‌పై అదనంగా రూ.10 వరకు వసూలు చేస్తున్నారు. బెల్టుషాపు నిర్వాహకులు ఒక్కో బాటిల్‌పై ఎమ్మార్పీ ధర కంటే అదనంగా రూ.30 నుంచి రూ.50 వరకు దండుకుంటున్నారు. అయితే ఇలా విక్రయించిన మద్యం సైతం ప్రభుత్వ మద్యం డిపోల నుంచి సరఫరా చేసిన మద్యామా? లేక ఇబ్రహీంపట్నం కేంద్రంగా తయారుచేసి సరఫరా చేసిన నకిలీ మద్యమా? అనే అనుమానాలు ఇప్పుడు మందుబాబులను కలవరపెడుతున్నాయి.



కంచికచర్లలో మద్యం సీసాలకు దుకాణదారులు వేసిన స్టిక్కర్లు

అధికార పార్టీ నేతే కీలకం..

కంచికచర్ల ఎక్సైజ్‌శాఖలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్న వ్యక్తి, వీరులపాడు మండలంలో తన కుటుంబసభ్యుడికి ఉన్న మద్యం దుకాణం ద్వారా నకిలీ మద్యం విక్రయాలు సాగించారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

అధికార పార్టీకి చెందిన మద్యం వ్యాపారి కంచికచర్ల సిండికేట్ ద్వారా ఈ నకిలీ మద్యం అమ్మకాలు ఆయా షాపుల్లో జోరుగా సాగాయనే ప్రచారం సాగుతోంది. రాష్ట్రంలో కల్తీమద్యం తయారుదారుడు, నకిలీ మద్యంకేసులో ఏ1గా ఉన్న అద్దేపల్లి జనార్దనరావుకు కంచికచర్లలో ఓ మద్యం దుకాణంలో వాటా ఉండటంతో ఈ షాపులో సాగిన మద్యం విక్రయాలపై కూడా ప్రజలు పెద్దఎత్తున అనుమానాలు వ్యక్తంచేస్తుండటం గమనార్హం. రాష్ట్రంలో పలు ప్రాంతాలకు నకిలీ మద్యాన్ని సరఫరా చేసిన జనార్దనరావు తనకు వాటా ఉన్న షాపులో తప్పకుండా నకిలీ మద్యం అమ్మకాలు సాగించి ఉంటారని మందుబాబులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

లోతైన విచారణ సాగితేనే...

నకిలీ మద్యం తయారీ వెలుగుచూసిన నేపథ్యంలో ఎక్సైజ్‌శాఖ అధికారులు పలువురు బెల్టుషాపుల నిర్వాహకులను అదుపులోకి తీసుకుని విచారించడం గమనార్హం. అదేసమయంలో జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారులు సైతం మద్యం అమ్మకాల్లో తేడాలను గుర్తించేందుకు కంచికచర్ల ఎక్సైజ్ సిబ్బందిని విజయవాడ పిలిపించి రికార్డులను సైతం తనిఖీ చేయడం నకిలీ మద్యం అమ్మకాల వ్యవహారంపై మరిన్ని అనుమానాలకు ఊతమిస్తోందని చెప్పవచ్చు. ముత్తమ్మీద కంచికచర్ల, వీరులపాడు, నందిగామ మండలాల్లో టీడీపీ నాయకుడి అండతో పలు మద్యం దుకాణాలు, ఆయా బెల్టుషాపుల్లో నకిలీ మద్యం అమ్మకాలు ఇష్టారీతిన కొనసాగాయనే చర్చ మాత్రం నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది. ఇకనైనా ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఈ అంశంపై విస్తృత స్థాయిలో విచారణ జరిపి నిజానిజాలు నిగ్గుతేల్చాలని ప్రజలు కోరుతున్నారు.

> **నకిలీ మద్యం విక్రయాలకు తావు లేదు..**
>
> కంచికచర్ల ఎక్సైజ్‌శాఖ పరిధిలో ఎక్కడ కూడా నకిలీ మద్యం అమ్మకాలు సాగలేదు. ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం తయారీ వ్యవహారం బయటపడ్డాక మాపరిధిలోని ఆయా మద్యం దుకాణాల్లో స్టాక్, రిజిష్టర్లతోపాటు అమ్మకాలను సైతం క్షుణ్ణంగా పరిశీలించాం. ఎటువంటి తేడాలు లేవు.
>
> – అక్రుపున్నీసా బేగం, కంచికచర్ల ఎక్సైజ్ సీఐ

16నుంచి పాంచాయతన యాగం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మవారి ఆలయంలో ఈనెల 16 నుంచి 26వతేదీ వరకు పది రోజులపాటు హైదరాబాద్‌కు చెందిన ఈమని ప్రసన్నకుమార్‌చే 40 మంది రుత్వికులతో పాంచాయతన యాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈవో కిషోర్‌కుమార్ తెలిపారు. చైర్మన్ చాంబర్‌లో గురువారం ఆలయ పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి తీర్మానాలు ఆమోదించారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు జరిగిన ఆదాయ, వ్యయాలకు పాలకవర్గం ఆమోదించింది. సిబ్బందికి 2018 నుంచి డీఏ, హెచ్‌ఆర్ఏ బకాయిల చెల్లింపు, సెప్టిక్ ట్యాంక్, సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటు, తిరుపతమ్మ సదన్ చుట్టూ ప్రహరీ పునర్నిర్మాణం, ఆలయానికి రంగులు వేయడం, ఎలక్ట్రికల్, వాటర్ నిర్వహణ, ఉపాలయ శిఖరము నకు వెండితాపడం తదితర పనులు చేపట్టేందుకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో ఆలయ ఈఈ ఎల్ రమ, ఏఈవో జంగం శ్రీనివాసరావు, ఏఈ రమ, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



పాలకవర్గ సమావేశంలో చైర్మన్ శ్రీనివాసరావు, ఈవో కిషోర్‌కుమార్, సభ్యులు, సిబ్బంది

అభివృద్ధి పనులపై ఎంపీడీవో సమీక్ష

నందిగామ రూరల్: చెత్త నుంచి ఎరువులు తయారు చేసి రైతులకు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చెత్త సంపద తయారీ కేంద్రాలను నిర్వహిస్తుందని ఎంపీడీవో ప్రసాదరావు పేర్కొన్నారు. మండలంలోని లింగాలపాడు గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త సంపద తయారీ కేంద్రాల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం గ్రామంలోని సచివాలయం, రైతుసేవా కేంద్రంను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నామేశ్వరరావు, కార్యదర్శి సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

పనులను నిరంతరం పర్యవేక్షించాలి..

గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎంపీడీవో ప్రసాదరావు సమీక్షించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల వివరాలను అడిగితెలుసుకున్నారు. గ్రామాల్లో సాగుతున్న పనులను నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామాల కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

కాన్షీరాంకు ఘన నివాళి

నందిగామరూరల్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలలో రాజకీయ చైతన్యం కలిగించిన మహోన్నత వ్యక్తి కాన్షీరాం అని బీఎస్పీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బచ్చలకూర పుష్పరాజ్ కొనియాడారు. బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షిరాం వర్ధంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక గాంధీ సెంటరులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా పుష్పరాజ్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆకాంక్ష మేరకు దేశాన్ని పాలించాలనే లక్ష్యం దిశగా అడుగులు వేశారన్నారు. లక్ష్య సాధనకు లక్షలాది మంది బహుజనులను తయారు చేసిన గొప్ప రాజకీయవేత్త కాన్షీరాం అని కొనియాడారు. కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు యరగొర్ల ఉదయ్‌కిరణ్ యాదవ్, దాసరి కృష్ణ, దున్నా కోటేశ్వరరావు, జూపూడి శ్రీనివాసరావు, మార్కపూడి చంద్రరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంచికచర్లలో..

కంచికచర్ల: బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం బహుజన జాతులకు దిక్సూచిగా పనిచేశారని ఆపార్టీ నియోజకవర్గ నాయకుడు, ఎంపీటీసీ సభ్యుడు బర్రె ఉదయ్‌కిరణ్ పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో గురువారం కాన్షీరాం వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ కాన్షీరాం పేద ప్రజలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేశారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదలను కలుపుకుంటూ ముందుకు సాగిన గొప్పనాయకుడన్నారు. సామాజిక పరివర్తన కోసం, రాజ్యాధికారం కోసం పోరాడి అశువులు బాసిన మహాత్మా జ్యోతిరావు పూలే, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయాల ప్రతిరూపం కాన్షీరాం అని కొనియాడారు. కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు గారపాటి వంశీ, బడుగు కోటి, చింటూ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నందిగామలో కాన్షీరాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బి.పుష్పరాజ్, నాయకులు



కంచికచర్లలో కాన్షీరాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బర్రె ఉదయకిరణ్ తదితరులు

వైమానిక దళ సేవలు అనిర్వచనీయం



నందిగామటౌన్: దేశ రక్షణలో భారత వైమానిక దళం కీలకపాత్ర పోషిస్తోందని గ్రంథాలయ అధికారి రామచంద్రుడు పేర్కొన్నారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గురువారం వైమానిక దళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా భరతమాత చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిందూర్ ఆపరేషన్ విజయంలో వైమానిక దళం కృషి అనిర్వచనీయమని కొనియాడారు. వెటర్నరీ అధికారి ఆంజనేయులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

రిటైర్డు ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక



జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం(జగ్గయ్యపేట యూనిట్) అధ్యక్ష, కార్యదర్శులుగా షేక్ అబ్బాస్‌అలీ, కె.కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. సంఘ కార్యాలయంలో గురువారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సహాధ్యక్షులుగా ఎస్.రంగారావు, సీహెచ్.ప్రేమ్‌చంద్, కోశాధికారిగా కర్లపాటి కొండ, గౌరవ సలహాదారుగా పార్థసారథి, సంయుక్త కార్యదర్శిగా వి.రామారావు, సభ్యులుగా చావా కృష్ణయ్య, కర్నాటి రఘు, సీహెచ్.సీతారామారావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘ సీనియర్ సభ్యులు మాదిరాజు కేశవరావు, జి.శంకరరావు, డాక్టర్ జీడీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



కె.ఆనంద్‌కుమార్



ఎస్.నరేష్

వత్సవాయి: వత్సవాయిలో గురువారం ఎస్టీయూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎస్టీయూ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా కె.ఆనంద్‌కుమార్, సామాల నరేష్, ఆర్థిక కార్యదర్శిగా వై.పురుషోత్తమరావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆర్.కోటేశ్వరరావు, జిల్లా ప్రతినిధులు పీడీపీ ప్రసాదరావు, ఎం.శ్రీహరి, రవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యమ్మతల్లి గ్రామోత్సవం



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో వేంచేసియున్న శ్రీసత్యమ్మ అమ్మవారి ఆలయం 14వ వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీసత్యమ్మ తల్లి గ్రామోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. మహిళల కోలాటాలు, చిన్నారుల వేషధారణలు, దీపోత్సవం ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. ఆయా కార్యక్రమాలను ప్రైవేటు ఇంప్రూవ్‌మెంట్ ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

టీడీపీకి రాజీనామా

కంచికచర్ల: టీడీపీ క్రియాశీలక సభ్యుడు, నియోజకవర్గ 34 యూనిట్ ఇన్‌చార్జి కంచికచర్లకు చెందిన బర్రె వాసు ఆపార్టీ పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు గురువారం ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత కారణాలతో పార్టీకి రాజీనామ చేసినట్లు ఆయన వివరించారు.

అవగాహన సదస్సు నిర్వహణ



బూదవాడ(జగ్గయ్యపేట): గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బాపట్ల కళాశాల విద్యార్థులు గ్రామీణ పని అనుభవ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు రంగవల్లులతో గ్రామ స్వరూపాన్ని తయారు చేసి గ్రామ విస్తీర్ణం, గ్రామ చిత్రపటం, సీజనల్ క్యాలెండర్, మొబిలిటీ మ్యాప్, సమయరేఖతోపాటు గ్రామానికి సంబంధించిన అంశాలను చిత్రాల రూపంలో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గరికపాడు కృషి విజ్ఞానకేంద్రం(కేవీకే) కోఆర్డినేటర్ రవికిషోర్, శాస్త్రవేత్త వెంకటరెడ్డి, కార్యదర్శి రంగారావు, కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎలుకల నివారణపై రైతులకు అవగాహన



షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): పంట పొలాలలో ఎలుకల నివారణకు రైతులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఏడీఏ భవానీ సూచించారు. మండలంలోని షేర్‌మహ్మద్‌పేటలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం రైతులకు అవగాహన కల్పించారు. ఏడీఏ మాట్లాడుతూ వరిలో ఎలుకల నిర్మూలనకు బ్రమొడయోలోన్ పిచికారీ చేయాలన్నారు. ఈ మందును రైతుసేవా కేంద్రాల ద్వారా నూరు శాతం రాయితీపై సరఫరా చేస్తున్నట్లు వివరించారు. గట్లపై ఉన్న బొరియలను గుర్తించి మందును పెట్టి బొరియలను మూసివేయాలని సూచించారు.

కంచికచర్ల మండలంలో..



గొట్టుముక్కల(కంచికచర్ల): మండలంలోని గొట్టుముక్కల గ్రామంలో గురువారం సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని నిర్వ హించారు. వ్యవసాయాధికారి కె.విజయకుమార్ మాట్లాడుతూ ఎలుకల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సాయినాథ్, రైతులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన అవసరం



మాగల్లులో జీఎస్టీ కరపత్రాలను ప్రదర్శిస్తున్న సీహెచ్‌వో వర్షిణి, సిబ్బంది



లింగాలపాడులో అవగాహన ర్యాలీలో పాల్గొన్న సత్యకుమార్, వైద్యారోగ్య సిబ్బంది



గంద్రాయి: జీఎస్టీ అవగాహన ర్యాలీలో పాల్గొన్న హెల్త్ సూపర్‌వైజర్ వెంకట్రావ్, సిబ్బంది

నందిగామరూరల్: కేంద్రప్రభుత్వం జీఎస్టీ నూతన విధానంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై పడుతున్న పన్నుల భారాన్ని తగ్గించిందని జీఎస్టీ ప్రత్యేకాధికారి సత్యకుమార్ తెలిపారు. మండలంలోని లింగాలపాడు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో గురువారం జీఎస్టీ నూతన విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో వైద్యసిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి కామేశ్వరి, వైద్యారోగ్య సిబ్బంది నాగేశ్వరరావు, సరోజిని, సీతారామిరెడ్డి, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జీవిత బీమాపై జీఎస్టీ రద్దు..

జీవిత బీమా ఆరోగ్య సేవలలో గతంలో 18 శాతంగా ఉన్న జీఎస్టీని కేంద్రప్రభుత్వం పూర్తిగా తొలగించిందని సీహెచ్‌వో వర్షిణీ తెలిపారు. మాగల్లులోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో జీఎస్టీ నూతన విధానాలపై గురువారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మెడికల్ గ్రేడ్ ఆక్సిజన్‌తోపాటు వివిధ రకాల మందులు, వ్యాధి నిర్ధారణ పరీక్ష కిట్‌లు, కళ్లద్దాలపై 12శాతం ఉన్న జీఎస్టీని ఐదు శాతానికి తగ్గించినట్లు గుర్తుచేశారు. క్యాన్సర్ మందులపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేసినట్లు వివరించారు.



నందిగామలో జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

జగ్గయ్యపేట మండలంలో..

గంద్రాయి(జగ్గయ్యపేట): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పిస్తూ వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం గంద్రాయి గ్రామంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ వెంకట్రావ్ మాట్లాడుతూ ఔషధాలు, వైద్య పరికరాలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడం శుభపరిణామమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది అనిల్, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

నందిగామ పట్టణంలో..

నందిగామటౌన్: జీఎస్టీని తగ్గించి పేదల ప్రజారోగ్యం విషయంలో కేంద్ర ప్రభుత్వం సూపర్ గిఫ్ట్ ఇచ్చిందని మున్సిపల్ కమిషనర్ లోవరాజు పేర్కొన్నారు. జీఎస్టీ నూతన విధానంపై పట్టణంలోని పలు ప్రధాన వీధుల్లో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీని తగ్గించడంతో వైద్య సేవలు పేదలకు మరింత అందుబాటులోకి వచ్చాయన్నారు. జీఎస్టీని తగ్గించి కేంద్ర ప్రభుత్వం సాహసోపేత నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి చైర్మన్ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మక్కపేట(వత్సవాయి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పర్యావరణ సామాజికవేత్త కొమరగిరి రవీంద్ర భరద్వాజ్ పేర్కొన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాల సామాజిక విజ్ఞాన కళాశాల గుంటూరు లాంఫాం విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ కార్యక్రమం గురువారం రెండోరోజు చేరింది. ఈసందర్భంగా విద్యార్థులు పర్యావరణ ప్రాధాన్యంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రవీంద్రభరద్వాజ్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోలేకపోతే భవిష్యత్‌లో తీవ్రంగా నష్టపోతామని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి గ్రామంలో పర్యావరణం ప్రాధాన్యం వివరిస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ ఎన్.ప్రసూన, ఎంఆర్‌టీ కళాశాల ప్రిన్సిపాల్ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.